సాక్షి
వనపర్తి
శుక్రవారం ౹ 29 ౹ మార్చి ౹ 2024

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-34 (శుక్రవారం సాయంత్రం)
సహర్ 4-51 (శనివారం తెల్లవారుజామున)



బాలింత మృతిపై విచారణ
అచ్చంపేటలో బాలింత మృతి ఘటనపై రాష్ట్ర బృందం విచారణ చేపట్టింది.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 42.2 /20.0
ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

‘పది’ పరీక్షలకు 27 మంది గైర్హాజరు

వనపర్తిటౌన్: జిల్లా వ్యాప్తంగా గురువారం 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన బయోలాజికల్ సైన్స్ పరీక్షకు 27 మంది గైర్హాజరయ్యారు. 6,906 మంది రెగ్యులర్ విద్యార్థులకుగాను 6,884 మంది హాజరయ్యారు. దీంతో 99.68 శాతం హాజరు నమోదైంది. ప్రైవేటు సెంటర్‌లో 51 మందికిగాను 46 మంది హాజరయ్యారు. మొత్తం 6,957 మంది విద్యార్థులకుగాను 6,930 మంది పరీక్షకు హాజరు కాగా.. 27 మంది గైర్హాజరయ్యారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



వనపర్తిటౌన్: జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సి.మోహన్‌కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బాలనాగయ్య, మహిళా ప్రతినిధిగా ఎం. శ్రీదేవి, ఉపాధ్యక్షులుగా డి.కృష్ణయ్య, జె.బ్రహ్మయ్యఆచారి, సహాయ కార్యదర్శిగా పి.శంకర్, కోశాధికారిగా ఎం.ఆంజనేయులు, క్రీడల అధికారిగా ఎస్.రాందూలి, గ్రంథాలయ కార్యదర్శిగా ఎం.కృష్ణయ్య, కార్యవర్గ సభ్యులుగా ఎస్.రాజు, రియాజ్ అహ్మద్, ఎస్.త్రినాథ్, ఎస్.తిరుపతయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులుగా జి.ఉత్తరయ్య, ఎం.రఘు, కె.ప్రవీణ్‌కుమార్ వ్యవహరించారు.

ఆత్మకూర్: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో గురువారం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అక్కల నారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శిగా దివాన్జీ అశోక్‌కుమార్, ఉపాధ్యక్షులుగా జీకే రాములు, ఏపీ రాజేందర్, సహాయ కార్యదర్శిగా ముక్తేశ్వర్, కోశాధికారిగా అశోక్‌కుమార్‌గౌడ్, అడ్వైజరీ కమిటీ సభ్యులుగా తిప్పారెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, సభ్యులుగా గంగాధర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, అబ్రహంలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

అనుమతి లేకుండా మందులు అమ్మితే చర్యలు

పెబ్బేరు రూరల్: ఆర్‌ఎంపీలు అనుమతి లేకుండా మందులు అమ్మితే చర్యలు తప్పవని జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ రష్మి హెచ్చరించారు. పెబ్బేరు మండలం సూగూరులో ఆర్‌ఎంపీ శ్రీకాంత్ ప్రథమ చికిత్స కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. అనుమతి లేకుండా విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 35 రకాల అల్లోపతి మందులను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై డ్రగ్స్, కాస్మోటిక్స్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ రబియా ఉన్నారు.

రూ. 1.50 లక్షలు సీజ్

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గండిలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ వద్ద గురువారం రూ. 1.50 లక్షల నగదును పట్టుకుని, సీజ్ చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన విరాహత్‌అలీ తన కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తరలిస్తుండగా.. పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.





ఓటు వేసేందుకు వస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఓటు వేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌లోకి వెళ్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు

99.86% పోలింగ్

ప్రశాంతంగా మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక

- మొత్తం 1,439 ఓటర్లకు గాను 1,437 మంది వినియోగం
- కొడంగల్‌లో ఓటేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఏప్రిల్ 2న ఫలితాల వెల్లడి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి గురువారం నిర్వహించిన ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నికలో 99.86 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 1,439 మంది ఓటర్లకు గాను 1,437 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోగా.. ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు ఓటు వేయలేదు. కొడంగల్ ఎమ్మెల్యేగా ఎక్స్ అఫీషియో హోదాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని 14 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు, ఉమ్మడి జిల్లాలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు పార్టీల వారీగా బృందాలుగా తరలివచ్చి ఓటు వేశారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ క్రమంలో ఆయన గతేడాది డిసెంబర్ 8న రాజీనామా చేయడంతో ఈ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికలో కాంగ్రెస్ తరఫున పారిశ్రామికవేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డి బరిలో ఉండగా, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్ గౌడ్ పోటీ చేశారు. కొత్తగా ఎన్నిక కానున్న ఎమ్మెల్సీ పదవీ కాలం 2028 జనవరి 4 వరకు కొనసాగుతుంది.



వనపర్తి పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు వేచి ఉన్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు

ఏప్రిల్ 2న లెక్కింపు..

ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఏప్రిల్ 2న మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల భవనంలో నిర్వహించనున్నారు. అదే రోజున ఫలితాలను వెల్లడించనున్నారు. గురువారం సాయంత్రం పోలింగ్ ముగిసిన వెంటనే పటిష్ట బందోబస్తు నడుమ బ్యాలెట్ బాక్స్‌లను కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఏప్రిల్ 4 నాటికి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రక్రియ ముగియనుంది.

ఇద్దరే గైర్హాజరు..

ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉపఎన్నిక పోలింగ్ కొనసాగింది. ఇతర ప్రాంతాల్లో నిర్వహించిన క్యాంపుల నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న ఆయా పార్టీల నేతలు గురువారం ఉదయం నేరుగా బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారుగా అన్ని కేంద్రాల్లోనూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు 25 శాతంలోపే ఓటింగ్ నమోదైంది. 10 గంటల తర్వాత బృందాలుగా తరలివచ్చిన ప్రజాప్రతినిధులతో పోలింగ్‌కేంద్రాల వద్ద సందడి నెలకొంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు వేర్వేరుగా బస్సుల్లో తరలివచ్చి ఓటుహక్కు వినియోగించుకోవడంతో మధ్యాహ్నం 12 గంటల వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 70 శాతానికి పైగా ఓటింగ్ జరిగింది. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి నారాయణపేట, నాగర్‌కర్నూల్ కేంద్రాల్లో మినహా అన్నిచోట్ల వందశాతం పోలింగ్ నమోదైంది. ఈ ఉపఎన్నికలో నారాయణపేట జిల్లా మక్తల్ మండలం మంథన్‌గోడు బీజేపీ ఎంపీటీసీ సభ్యురాలు సుమిత్ర అనారోగ్యం కారణంగా, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గుడ్లనర్వ ఎంపీటీసీ సభ్యురాలు శారద అమెరికాలో ఉండటంతో ఓటుహక్కును వినియోగించుకోలేదు.



ఓటు వేస్తున్న పెబ్బేరు మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ

పోలింగ్ కేంద్రాల వారీగా ఓటేసిన వారి వివరాలు..

పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	మొత్తం
మహబూబ్‌నగర్	117	128	245
కొడంగల్	27	29	56
షాద్‌నగర్	77	94	171
నారాయణపేట	89	115	204
వనపర్తి	99	119	218
గద్వాల	91	134	225
కొల్లాపూర్	28	39	67
నాగర్‌కర్నూల్	48	52	100
అచ్చంపేట	37	42	79
కల్వకుర్తి	31	41	72
మొత్తం	644	793	1,437

■ ఓటేసిన ప్రముఖులు..

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఎక్స్ అఫీషియో హోదాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. అలాగే కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్‌లో ఎంపీ రాములు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, అచ్చంపేటలో ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తిలో కసిరెడ్డి నారాయణరెడ్డి, గద్వాలలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, నారాయణపేటలో చిట్టెం పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్‌లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, జి.మధుసుదన్‌రెడ్డి, వనపర్తిలో మేఘారెడ్డి, షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఓటు వేశారు.

■ పెద్దఎత్తున ప్రలోభాలు..

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రధాన పార్టీలు ఓటర్లను ప్రభావితం చేసేందుకు పెద్దఎత్తున ప్రలోభాలకు గురిచేసినట్లు తెలుస్తోంది. బుధవారం రాత్రి సైతం ఓ పార్టీకి చెందిన క్యాంపులో నేతల మధ్య వివాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. తాము ముందుగానే ఒప్పందం చేసుకున్న ప్రకారం రావాల్సిన మొత్తం అందకపోవడంతో ఎన్నికలో ఓటేసేందుకు తాము రావడం లేదని తెగేసి చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ అభ్యర్థి వారిని బుజ్జగించేందుకు రెండున్నర తులాల చొప్పున గోల్డ్ కాయిన్లను అందజేసినట్లు తెలుస్తోంది. ఈ గోల్డ్ కాయిన్లకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో రాజకీయంగా దుమారం చెలరేగుతోంది.

ఓటింగ్ ప్రక్రియ సాగిందిలా..

- జిల్లాలో మొత్తం 218 మంది ఓటర్లు ఉండగా.. 99 మంది పురుషులు, 119 మంది మహిళలు ఉన్నారు. ఎక్స్‌అఫీషియో హోదాలో స్థానిక ఎమ్మెల్యే ఓటుహక్కును వినియోగించుకున్నారు.
- సాయంత్రం ఒక్క నిమిషమైతే పోలింగ్ ముగుస్తుందనగా కొత్తకోట మండలం అమడబాకుల ఎంపీటీసీ శేషిరెడ్డి తన ఓటుహక్కు వినియోగించుకోవడం విశేషం.
- బీజేపీ అభ్యర్థి స్థానిక సంస్థల ఉపఎన్నిక బరిలో లేకపోయినా.. ఆ పార్టీకి చెందిన వనపర్తి జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి ఒంటరిగి పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. పార్టీ అభ్యర్థి లేకపోయినా.. ఓటుకు దూరంగా ఉండటం ఇష్టంలేక తన మనసుకునచ్చిన అభ్యర్థికి ఓటువేసినట్లు మీడియాకు చెప్పారు.
- మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఏదుల గ్రామ బీఆర్‌ఎస్ ఎంపీటీసీ నరేందర్ ఓటును తన భార్యతో వేయించేందుకు అనుమతించాలని పీఓను కోరగా.. పేషంట్‌ను తీసుకొస్తే, అనుమతిస్తామని చెప్పారు. దీంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎంపీటీసీ నరేందర్‌ను అంబులెన్స్‌లో పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చి, తన భార్యతో ఓటు వేయించారు.



క్యాంపుల నుంచి నేరుగా పోలింగ్ కేంద్రానికి



పోలింగ్ కేంద్రంలోకి వెళ్తున్న కొత్తకోట బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు

వనపర్తి: జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. ప్రధాన పార్టీలు ప్రత్యేక క్యాంపులకు తరలించిన ప్రజాప్రతినిధులను నేరుగా పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓటర్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి పోలింగ్ కేంద్రానికి వచ్చారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ఓటర్లు గ్రూప్‌గా వెళ్లి ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్ సరళిని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి పరిశీలించారు. జిల్లాలో మొత్తం 218 ఓటర్లు ఉండగా.. వందశాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 10 గంటల వరకు 31 మంది, మధ్యాహ్నం 12 గంటల వరకు 150 మంది, 2 గంటల వరకు 212 మంది, సాయంత్రం 4 గంటల వరకు 218 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం..

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి గెలుపు ఖాయమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహిస్తున్న తొలి ఎన్నికల్లో సత్తా చాటాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు స్థానిక ప్రజాప్రతినిధులను ఏకం చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ప్రజాపాలనకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ నుంచి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు స్వచ్ఛందంగా పార్టీలోకి వస్తున్నారన్నారు.

బీమా.. ధీమా

- పీఎం మత్స్యయోజనతో జాలర్ల కుటుంబాలకు భరోసా
- జిల్లాలో 142 మత్స్యకార్మిక సొసైటీలు
- 12వేల మంది సభ్యులు
- ఏప్రిల్ 15 వరకు దరఖాస్తు గడువు



ములమళ్ల చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు

అమరచింత: నిత్యం చెరువులు, కుంటలు, నదుల్లో చేపలు పడుతూ జీవించే మత్స్యకారులు ఎప్పుడే ప్రమాదానికి గురవుతారో తెలియని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో మత్స్యకారుల కుటుంబాలకు భరోసానిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం మత్స్యయోజనతో బీమా సౌకర్యం కల్పిస్తోంది. మత్స్యకార్మిక సొసైటీల్లో సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరూ బీమా చేయించుకునేలా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మత్స్యశాఖ అధికారులు అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు మత్స్యకార సొసైటీల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఏప్రిల్ 15వ తేదీలోగా జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు.

18నుంచి 50 ఏళ్ల వారికి..

మత్స్యకారులకు బీమాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధివిధానాలను ప్రకటించాయి. 18 నుంచి 50 ఏళ్ల వయసు గల మత్స్యకారులు పీఎం మత్స్యయోజనకు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆధార్ కార్డుతో పాటు మత్స్యశాఖ జారీచేసిన గుర్తింపుకార్డు, సంఘం, కుటుంబ సభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి. ఏదేని ప్రమాదంలో మత్స్యకారుడు మృతిచెందితే రూ.5లక్షలు, శాశ్వత వైకల్యం పొందితే రూ.2.50 లక్షలు, గాయపడితే ఆస్పత్రి ఖర్చుల కింద రూ.25వేలు చెల్లిస్తారు. బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తున్నందున, లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనం దక్కనుంది.

సంఘాల వారీగా..

మత్స్యకార సంఘాల వారీగా బీమా కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఒక్కో గ్రామంలో 25 మంది నుంచి 1000 మంది దాక మత్స్యకారులు సంఘంలో సభ్యులుగా కొనసాగుతున్నారు. ఒక్కొక్కరుగా బీమా కోసం దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు కలుగుతాయనే ఆలోచనతో సంఘంలోని సభ్యులందరూ ఒకేసారి బీమా చేసుకునే అవకాశం కల్పించారు. సభ్యుల వివరాలను పూర్తి స్థాయిలో సేకరించి, జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో నమోదు చేయించుకోవచ్చు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయించుకోని వారికి బీమా వర్తించదు.

- జిల్లాలోని 14 మండలాల్లో మొత్తం 142 మత్స్యకార్మిక సొసైటీలు ఉన్నాయి. 12 వేలకు పైగా మత్స్యకారులు కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పటికీ సభ్యత్వం లేని కార్మికులకు నైపుణ్య పరీక్షలు నిర్వహించి, సభ్యత్వం ఇచ్చే కార్యక్రమం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని.. అలాంటి వారు మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా అధికారి తెలిపారు.

అందరికీ అవకాశం కల్పించాలి..



మత్స్యకారులకు బీమా సౌకర్యం కల్పించడం సంతోషకరం. చేపల వేటపై బతుకుతున్న తాము ప్రమాదాలకు గురైనప్పుడు ఇచ్చే బీమా డబ్బులు కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతాయి. మత్స్యకారులందరికీ బీమా సౌకర్యం కల్పించాలి.

– వెంకటన్న, మత్స్యకార్మికుడు, అమరచింత

వయో పరిమితి పెంచాలి..



50 ఏళ్లలోపు వారికి మాత్రమే బీమా సౌకర్యం కల్పించడం తగదు. దాదాపుగా 50 ఏళ్ల వయసు పైబడిన జాలర్లే ఎక్కువగా చేపలు పడుతున్నారు. ప్రభుత్వం వీరిని గుర్తించి, వయో పరిమితిని పెంచాలి. మత్స్యకారులందరికీ బీమా సౌకర్యం కల్పించాలి.

– రవికాంత్, మత్స్యకార్మిక సంఘం కోశాధికారి, అమరచింత

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి..



18నుంచి 50 ఏళ్ల వయసు గల జాలర్లు గుర్తింపు కార్డు, ఆధార్‌తో ప్రధాన మంత్రి మత్స్యయోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. ఈవిషయాన్ని ఇప్పటికే గ్రామాల సొసైటీలకు తెలియజేశాం. పథకంతో కలిగే ప్రయోజనాలపై జాలర్లకు అవగాహన కల్పించాం. అర్హులైన వారు ఏప్రిల్ 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి.

– డా.లక్ష్మప్ప, మత్స్యశాఖ ఏడీ

పెద్దగుట్టలో చెలరేగిన మంటలు

- భయాందోళనలో ఖిల్లాఘనపురం గ్రామస్తులు



ఖిల్లాఘనపురం గ్రామ సమీపంలోని గుట్టలో చెలరేగిన మంటలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రాన్ని అనుసరించి ఉన్న పెద్దగుట్టలో గురువారం రాత్రి మంటలు చెలరేగాయి. ఖిల్లాఘనపురం – పర్వతాపూర్ దారిలో ఉన్న ఫారెస్ట్ కార్యాలయ సమీపంలోని దీపం గుట్టలో మొదట మంటలు వ్యాపించాయి. అక్కడి నుంచి పెద్దగుట్ట వరకు మంటలు వ్యాపించడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రివేళ కావడంతో అధికారులు, ప్రజలు గుట్టపైకి వెళ్లడానికి వీలు లేకుండాపోయింది. గుట్టల సమీపంలోనే ఖిల్లాఘనపురం ఉండటంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. గ్రామానికి మంటలు వ్యాపించకుండా ఉండేందుకు ముందుజాగ్రత్తగా ఫైరింజన్‌లను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. ఈవిషయమై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మంజులను వివరణ కోరగా.. అందరూ కలిసి సహాయం చేస్తే, గుట్టపైకి వెళ్లి మంటలను ఆర్పివేస్తామని తెలిపారు. గుట్టపైకి వెళ్లడానికి రాత్రివేళ వీలుకాదని.. ఉదయం వరకు ఏమీ చేయలేమని చెప్పుకొచ్చారు.

క్లుప్తంగా

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతి

● పట్టాలు దాటుతుండగా ఘటన

ఊట్కూరు: గూడ్స్‌రైలు ఢీ కొని వ్యక్తి అక్కడిక క్కడే మృతిచెందిన ఘటన మండల పరిధిలోని ఎడివెల్లి శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. డోలు దేవప్ప(35) మేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కాగా గురువారం తెల్లవారుజామున పట్టాలు దాటు తుండగా రాయిచూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీ కొట్టింది. ఘట నలో దేవప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా స్థానికులు గమనించి మృతదేహాన్ని ఇం టికి తీసుకువెళ్లారు. దేవప్పకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయమై ఊట్కూరు ఎస్‌ఐని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆయన తెలిపారు.

యువకుడిపై హత్యాయత్నం: కేసు నమోదు

బల్మూర్: మండల కేంద్రానికి చెందిన బత్తుల వినోద్ బుధవారం రాత్రి అచ్చంపేట నుంచి బల్మూర్‌కు తన బైక్‌పై వస్తుండగా మైలారం స్టేజి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన పాఠకులకు విధితమే. గురువారం బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. ఈ దాడి ఘటనలో అచ్చంపేటకు చెందిన తను ప్రేమించిన అమ్మాయి తల్లిదండ్రులు తీగల శ్రీని వాసులు, జానకితోపాటు రాంప్రసాద్, ధ్రువపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గతంలో కూడా వినోద్ కారులో వస్తుండగా వంగూర్ స్టేజీ, అచ్చంపేట శివా రులో గుర్తు తెలియని వ్యక్తులు రెండు సార్లు దాడికి యత్నించగా తప్పించుకున్నాడని తెలి పారు. ఈ దాడిలో వారి ప్రోద్బలంతో ఎవరైనా పాల్గొన్నారా లేక వీరే పాల్గొన్నారా? విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


గువ్వల బంగారమ్మ (ఫైల్)

గోపాల్‌పేట: చికిత్స పొందుతూ మహిళ మృ తి చెందిన ఘటన పొలి కెపాడులో చోటుచేసు కుంది. గోపాల్‌పేట ఎస్‌ఐ హరిప్రసాద్ తెలి పిన వివరాల మేరకు.. పొలికెపా డుకు చెందిన గువ్వల బంగారమ్మ (44) ఈనెల 26న మంగ ళవారం ఉపాధి హామీ కూలీ పనికి వెళ్లింది. పని చేస్తుండగానే అనారోగ్యానికి గురై కడుపునొప్పి, వాంతులు కాగా వనపర్తి ఆస్పత్రికి తరలిం చారు. గురువారం అక్కడే చికిత్స పొందుతూ మరణించింది. బంగారమ్మ తండ్రి గువ్వల స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బంగా రమ్మకు భర్త స్వామి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పోక్సో కేసులో యువకుడికి జైలు

కొత్తకోట రూరల్: ఓ బాలికను ప్రేమిస్తు న్నానని మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసిన యువకుడిని కొత్తకోట పోలీసులు జైలుకు పం పించారు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి వివరాల ప్రకారం.. నాటవెల్లికి చెందిన ఓ బాలికను వనపర్తి మండలం సవాయిగూడెం గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ కొంతకాలంగా ప్రేమిస్తు న్నానంటూ.. తాను లేకపోతే చనిపోతానంటూ భయపెట్టాడు. మాయమాటలు చెప్పి తీసుకె ళ్లాడు. కాగా బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి రాజ్‌కుమార్‌ని పట్టుకుని విచా రించారు. కోర్టులో హాజరు పర్చగా జడ్జి 14రోజుల పాటు రిమాండ్ విధించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అచ్చంపేట రూరల్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన గురువారం మం డలంలోని దుబ్బతండాలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. తండాకు చెం దిన జవహర్‌లాల్(33) కొన్ని రోజులుగా కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. గురువారం తన వ్యవ సాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని అచ్చంపేట ప్రాం తీయ ఆస్పత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఆయనకు భార్య కవిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని సిద్దాపూర్ ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

208 మంది చిన్నారులకు గుండె పరీక్షలు



పాలమూరు: జిల్లా వైద్యారోగ్యశాఖ, ఆర్‌బీఎ స్‌కే సంయుక్త ఆధ్వర్యంలో గురువారం హైద రాబాద్ కేర్ ఆస్పత్రి సహకారంతో జనరల్ ఆస్పత్రిలో 18ఏళ్ల లోపు వారికి ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. 208మంది చిన్నా రులు శిబిరానికి హాజరుకాగా పరీక్షలు చేశారు. 68మందికి ఆపరేషన్ అవసరమని గుర్తిం చారు. త్వరలో వారిని హైదరాబాద్‌లో ఆప రేషన్ చేయనున్నారు. డీఎంహెచ్‌ఓ కృష్ణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ జీవన్, ప్రశాంత్ పాటిల్, డాక్టర్ దీప, డీఈఐసీ మేనేజర్ దేవి దాస్, విద్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో బాలింత మృతిపై విచారణ


మన్ననూర్‌లో కల్పన కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న డాక్టర్ సుమిత్ర

● వైద్యురాలి పొంతన లేని సమాధానాలు
● అస్తవ్యస్తంగా రికార్డుల నిర్వహణ.. వెలుగులోకి కీలక అంశాలు
● ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని రాష్ట్ర బృందం వెల్లడి


అచ్చంపేట ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ సుమిత్ర

అచ్చంపేట రూరల్/ మన్ననూర్: తీవ్ర రక్తస్రావం తో బాలింత మృతిచెందిన ఘటనపై రాష్ట్ర బృందం సుదీర్ఘ విచారణ చేపట్టింది. అమ్రాబాద్ మండలం మన్ననూర్‌తోపాటు అచ్చంపేట ప్రాంతీయ ఆస్ప త్రిలో వైద్యులు, నిర్వహణపై మాతాశిశు ఆరోగ్య సంరక్షణ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ సుమిత్ర బృందం గురువారం విచారణ చేపట్టారు. ఈ నెల 21న అమ్రాబాద్ మండలం మన్ననూర్‌కు చెందిన గర్భిణి కల్పన(30)కు పురిటినొప్పులు రావడంతో అచ్చంపేటలోని వంద పడకల ప్రాంతీయ ఆస్ప త్రికి రాగా డ్యూటీ డాక్టర్, ఆస్పత్రి సూపరింటెండెం ట్ గర్భిణికి హెచ్‌బీ తక్కువగా ఉందని రెఫర్ చేసిన విషయమై పలు ప్రశ్నలు అడగగా వైద్యురాలు తేజ స్విని, సూపరింటెండెంట్ ప్రభు పొంతనలేని సమా ధానాలు చెప్పారు. గర్భిణిని రెఫర్ చేయాల్సిన అవసరం ఏమిటి.. ఆ రోజు విధుల్లో ఉన్న వైద్య సిబ్బందితోనూ విడివిడిగా విచారణ చేపట్టారు. హెచ్‌బీ తక్కువ ఉన్న విషయాన్ని గర్భిణి కుటుంబ సభ్యులకు చెప్పారా అని అడిగారు. కేసులు బయ టకు ఎందుకు పంపుతున్నారని ప్రశ్నించారు. విచా రణ చేపట్టిన అంశాలు, ఇతర విషయాలను కమిష నర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, సమగ్ర నివేదిక ప్రభుత్వానికి అందిస్తామని డాక్టర్ సుమిత్ర విలేకరులకు చెప్పారు.

గర్భిణులతో వివరాల సేకరణ

విచారణకు వచ్చిన రాష్ట్ర బృందానికి గర్భిణులు ఎదురుపడగా.. వారి రికార్డులను పరిశీలించారు. స్కానింగ్ చేయించుకున్నారా అని డాక్టర్ సుమిత్ర అడగగా ఆస్పత్రిలో స్కానింగ్ లేదని, బయటే చేయించుకుంటున్నామని అచ్చంపేట మండలం జోగ్యతండాకు చెందిన గర్భిణి సరిత చెప్పారు. ఎం దుకు పరీక్షలు చేయడం లేదని సిబ్బందిని అడగ గా.. మిషన్లు ఉన్నా పని చేయడం లేదని సమా ధానం చెప్పారు. కాగా 50 కి.మీ.,లకు పైగా ఉన్న ఏజెన్సీ గ్రామాల నుంచి గర్భిణులు వచ్చినా గురువారం ఆస్పత్రిలో వారికి పరీక్షలు జరపలేదని బృందం దృష్టికి తీసుకొచ్చారు.

అస్తవ్యస్తంగా నిర్వహణ..

వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినప్ప టికీ వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఆస్పత్రి నిర్వహణ అస్తవ్యస్తంగానే ఉంది. హెల్ప్‌డెస్క్ పనితీరు బాగా లేదని వచ్చిన బృందం గుర్తిం చారు. ఆస్పత్రికి వచ్చిన రోగుల వివరాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేవని, రెండు రిజిస్టర్లలో ఒకే పేరు నమోదైన విషయాన్ని ఆరాతీశారు. నెలకు 400 మందికి పైగా ఓపీ ఉండగా.. గురువారం కేవలం 16 మంది పేర్లు మాత్రమే ఉన్నాయని, అవి కూడా అసంపూర్తిగా ఉండటం ఏమిటని నిలదీశారు. హైరిస్క్ కేసుల వివరాలను అడిగి తెలుసుకు న్నారు. డెలివరీ, హైరిస్కు వివరాలను పూర్తి సమాచారంతో ఇవ్వాలని ఆదేశించారు. హెల్ప్ డెస్కులో సిబ్బంది పేరు, ఫోన్ నంబర్లు, ఓపీ నమోదు కేంద్రం వద్ద ఉన్న బోర్డులో పూర్తి వివరాలు పొందుపర్చాలని సూచించారు. అనంతరం పట్టణంలోని రెండు ప్రైవేటు ఆస్ప త్రులను పరిశీలిస్తామని చెప్పారు.

నేనెలా బతకాలి..

ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ తేజశ్రీ, స్రవంతి తమ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోలేదనే అక్కసుతోనే లేని ఆరోగ్య సమస్యలు చెప్పి ప్రసవం చేయకుండ నిరాకరించారని కల్పన భర్త ఆంజనేయులు ఆరోపించారు. రూ.వే లకు వేలు వసూలు చేసుకోవడంతో పాటు నా భార్యను పొట్టన పెట్టుకున్నారని విలపిం చారు. నా తల్లి, నా భార్య తండ్రి చిన్నప్పుడే చనిపోయారని, వృద్ధాప్యంలో ఉన్న నా తం డ్రి, మతిస్థిమితం నా భార్య తల్లి (అత్త)తో కలిసి వారం రోజుల బాబు ఎలా చూసుకో వాలని వాపోయాడు. ఈ విషయమై డాక్టర్ సుమిత్ర స్పందిస్తూ బాధితుల తరపున నివేదిక తయారు చేసి వైద్య కమిషనర్‌కు అం దజేస్తామన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున న్యాయం చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు పీహెచ్‌సీని పరిశీ లించారు. ఆస్పత్రి నిర్వహణకు సంబంధిం చిన వివరాలను వైద్యాధికారి సుధాకర్‌ను అడిగి తెలుసుకున్నారు.

రమణీయం.. రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

● వైభవంగా పశ్చిమాద్రి సిద్ధలింగ మహాస్వాముల బ్రహ్మోత్సవాలు
● మఠాధిపతుల ప్రత్యేక పూజా కార్యక్రమాలు
● భక్తులతో పులకించిన నేరడగం

మాగనూర్: తరలివచ్చిన అశేష భక్తజనం నడుమ. అంగరంగ వైభవంగా.. పశ్చిమాద్రి సిద్ధలింగ మహాస్వాముల మహారథోత్సవం నిర్వహించారు. గురువారం మండలంలోని నేరడగం భక్తుల సంద డితో పులకించింది. ఉదయం నుంచి మఠంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మఠాధిపతులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలలో ప్రధాన ఘట మైన స్వామివారి రథోత్సవానికి నియోజకవర్గ నలు మూలల నుంచి భక్తులు తరలివచ్చారు. మఠంలో ప్రత్యేక పూజల అనంతరం సిద్ధలింగ మహా స్వాముల వారి విగ్రహాన్ని పురోహితులు వేదమం త్రాలు చదువుతూ.. కాగడాల వెలుతురులో తీసుకు వచ్చి రథంలో ఉంచారు. అనంతరం భక్తులు మైదా నంలో తేరును ముందుకు లాగారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే, స్వామి వారి తులాభారం నిర్వహించారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎలాం టి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కొం డయ్య, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటయ్య, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, నెరడగం మాజీ సర్పంచ్ ఆశోక్‌గౌడ్, ఎం పీపీ శ్యామలమ్మ, ఈశ్వర్‌యాదవ్, ఎల్లాగౌడ్, నాగరాజు పాల్గొన్నారు. ఇదిలాఉండగా, రథోత్సవం లో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూలు నిర్వహించారు. అదే విధంగా మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ పాల్గొని స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.

సందెపు రాళ్ల పోటీలు..

నేరడగం గ్రామ పశ్చిమాద్రి సంస్థాన విరక్త మఠం సిద్ధలింగేశ్వర జాతర సందర్భంగా కర్ణాటక రాష్ట్ర గురుమిట్కల్ ఎమ్మెల్యే శర ణగౌడ, సిద్ధలింగ మహాస్వాములు సందెపు రాళ్ల పోటీలను గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన వారికి మఠం తరపున బహుమతులు అందజేయ నున్నట్లు తెలిపారు. పోటీలో మక్తల్ నియోజక వర్గంతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా అధిక సంఖ్యలో పోటీదారులు పాల్గొన్నారు.


హాజరైన డీకే అరుణ, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి


సిద్ధలింగ మహాస్వాములు

జాతీయ సదస్సులో డిగ్రీ విద్యార్థికి ప్రథమ బహుమతి


ప్రథమ బహుమతి, ప్రశంసా పత్రం అందుకుంటున్న రాహుల్

జడ్చర్ల టౌన్: సిద్దిపేటలో కొనసాగుతున్న రెండు రోజుల జీవవైవిధ్య పరిరక్షణ జాతీయ సదస్సులో డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి రాహుల్‌కు ప్రథమ బహుమతి లభించిందని వృక్ష శాస్త్ర అధ్యాపకుడు డా.సదాశివయ్య తెలియజేశారు. గురువారం జరిగిన సదస్సులో బీజెడ్‌సీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి రాహుల్ కళాశాల ప్రాంగణంలోని 'చెట్లు ఎంత కార్బన్‌డైఆక్సై డ్ తీసుకుంటున్నాయో అని చేసిన పరిశోధన ఫలి తాలను తెలియజేశారన్నారు. అందుకు గానూ జాతీయస్థాయి ప్రథమ బహుమతి లభించింద న్నారు. సదస్సులో తాను జీవవైవిధ్య పరిరక్షణలో మార్గదర్శక హీరోలు అనే అంశంపై ప్రసంగం చేశా నన్నారు. సదస్సులో పరిశోధక విద్యార్థి రమాదేవి, బీజెడ్‌సీ విద్యార్థి సాయిరాం పాల్గొన్నారని తెలి పారు. సదస్సులో ప్రథమ బహుమతి సాధించిన రాహుల్‌ను ప్రిన్సిపాల్ డా.అప్పియాచిన్నమ్మ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపక బృందం అభి నందించారు.

హత్య కేసులో ఆరుగురికి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అప్పయ్య

మహబూబ్‌నగర్ క్రైం: వ్యక్తిపై రాళ్లతో దాడి చేయగా.. చికిత్స పొందుతూ సదరు వ్యక్తి ఈ నెల 27న మృతిచెందాడు. దీంతో దాడి చేసిన వ్యక్తులపై హత్యా కేసు నమోదు చేయడంతోపాటు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం ఈ కేసుకు సంబంధించి వివరాలను వన్‌టౌన్ సీఐ అప్పయ్య వెల్లడించారు. పట్టణంలోని టీడీగుట్ట ఏరియాలోని వడ్డెర కాలనీలో నివాసం ఉంటున్న బాల వెంకట య్యకు ఈ నెల 12న రాత్రి అతని బావమరిది మార్ల లక్ష్మీనారాయణకు మధ్య గొడవ జరిగింది. వీరి మధ్యలో ఉన్న భూ తగాదాలు, పాత కక్ష్యలు మనస్సులో పెట్టుకొని బాల వెంకటయ్య ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో లక్ష్మీనారాయణతో పాటు అతని బంధువులు సతీష్, గణేష్, సంతోష్, మహేష్, శశికళతో కలిసి రాళ్లతో దాడి చేశారు. గాయపడిన వ్యక్తిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మొదట జిల్లా జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. చికిత్స పొం దుతూ ఈ నెల 27న ఉదయం మృతి చెందాడు. దీంతో మర్డర్ కేసు నమోదు చేసి నిందితులను 24గంటల్లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఏ1 మార్ల లక్ష్మీనారాయణ, ఏ2 మర్ల సతీష్, ఏ3 గణేష్, ఏ4 సంతోష్, ఏ5 మహేష్ ఏ6 శశికళను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలి పారు. సమావేశంలో ఎస్‌ఐ శ్రీనయ్య సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో తమ్ముడి మృతి

'పది' పరీక్షకు హాజరైన అక్క


పరీక్షకు హాజరైన విద్యార్థిని అనూష

మరికల్: తమ్ముడిని కోల్పాయి పుట్టెడు దుఃఖంలో ఉన్న విద్యార్థిని, దుఃఖాన్ని దిగ మిగుతూ పరీక్షకు హాజరైంది. మరికల్‌కు చెం దిన అనూషకు గురువారం పదోతరగతి సైన్స్ పరీక్ష ఉంది. కొంతకాలంగా అనారో గ్యంతో బాధపడుతున్న తమ్ముడు అర్జున్ తెల్లవారుజామున మృతిచెందాడు. పరీక్షకు వెళ్లలేని పరిస్థితుల్లో ఉండగా.. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు తల్లిదండ్రు లను ఓదార్చారు. విద్యార్థి అనూషను పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చి పరీక్ష రాయించారు. అనంతరం విద్యార్థిని తమ్ముడి అంత్యక్రి యల్లో పాల్గొంది.

కడుపు నొప్పి భరించలేక యువతి ఆత్మహత్య

రాజాపూర్: కడుపు నొప్పి భరించలేక యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాజాపూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. వంగూరి మండలం, పోతిరెడ్డిప ల్లికి చెందిన ప్రియాంక, రాజాపూర్ మం డలం కుత్నేపల్లికి చెందిన ఫొటో గ్రాఫర్ యోగేందర్ ఏడాది కిందట ప్రేమ పెళ్లి చేసు కున్నారు. కొన్ని రోజుల నుంచి రాజాపూర్ మండల కేంద్రంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని జీవిస్తున్నారు. అయితే తమ కుమా ర్తెకు అప్పుడప్పుడు కడుపునొప్పి వస్తుం డేదని చెప్పారు. కడుపునొప్పి బాధతో బుధ వారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుం దని మృతురాలి తల్లి నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిర్వహించి, మృతదే హాన్ని వారి బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ రవి తెలియజేశారు.

అట్టహాసంగా బర్రెలక్క వివాహం


కర్నె శిరీష అలియాస్ బర్రెలక్క, వెంకటేష్ దంపతులు

కొల్లాపూర్: 'హాయ్ నేను.. మీ బర్రెలక్క' అంటూ సోషల్ మీడియా ట్రెండింగ్‌లో నిలిచి.. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్ని కల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నుంచి నిరుద్యోగిని అంటూ ఎమ్మెల్యేగా బరిలో నిలిచి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కర్నె శిరీష అలియాస్ బర్రెలక్క వివాహం అట్టహాసంగా జరిగిం ది. స్వగ్రామానికి చెందిన దగ్గరి బంధువు వెంకటేష్‌ను గురు వారం ఉదయం పెద్దకొత్తపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బంధుమి త్రుల సమక్షంలో వివాహం చేసుకుంది. ఈమె వివాహం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వ దించారు. అలాగే ఉప్పల్ బాలు, వైజాగ్ సత్య, స్వాతినాయు డుతో పాటు పలువురు యూట్యూబర్లు బర్రెలక్క వివాహానికి హాజరయ్యారు.

గోంగూర సాగుతో లాభాలు



మదనాపురం: ఆకుకూరలను పోల్చుకుంటే గోం గూర సాగు చేస్తే రైతులకు లాభాలు ఉంటాయని కృషి విజ్ఞన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి తెలిపారు. దీనిలో రుచి, ప్రొటీన్లు, విటమిన్లు, ఇనుము పుష్కలంగా ఉంటాయి. నీటి వసతి ఉన్న భూముల్లో ఎకరానికి సుమారు 4 టన్నుల పంట పండించవచ్చని చెబుతున్నారు.

సాగు చేసే విధానం..

గోంగూర సాగు ఎర్ర నేలలు, తేలిక రకపు నేలలతో పాటు మురుగు బయటకు వెళ్లే ఉన్న నేలలు పూర్తిగా అనుకూలం. పంటను సాగు చేసే ముందు నేలను మూడు నుంచి నాలుగు సార్లు దున్నాలి. ఆఖరి దుక్కి 5 టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి.

విత్తనాలు, ఎరువుల మోతాదు..

ఎకరానికి ఆరు కిలోల విత్తనాలు సరిపోతాయి. ఆరు కిలోల నత్రజని ఆరు కిలోల భాస్వరం, 6 కిలోల పొటాష్ ఎరువులు వేసుకోవాలి.

నీటి యాజమాన్య పద్ధతులు

రైతులు అడ్డగోలుగా నీరు పెట్టకుండా తగిన జాగ్రత లు తీసుకోవాలి. విత్తనాలు వేసిన 3 నుంచి 4 రోజుల తర్వాత నీటిని వేసుకోవాలి. గోంగూర కోసిన ప్రతి సారి 10 కిలోల యూరియా చల్లుకోవాలి.

సస్యరక్షణ చర్యలు

పంట వచ్చే వరకు ఎలాంటి సస్యరక్షణ మందులు వాడకపోవడం చాలా మంచిది. తప్పని పరిస్థితి వస్తే అధికారుల సూచనలు, సలహాలు పాటించి పురుగు మందులు వాడాలి. గోంగూర పంటకు ప్రధానంగా దీపపు పురుగులు, పిండినల్లి పచ్చ పురుగు ఆశించే అవకాశాలు ఉంటాయి. వీటి నివా రణకు ముందుగానే వేపనూనే లీటర్ నీటిలో 5 మిల్లీలీటర్లు కలిపి పిచికారి చేసుకోవాలి.

పంట కోత

నాటిన 25 రోజులకు గోంగూర పంట తలలు తుంచివేయాలి. 15 రోజుల నుంచి 20 రోజుల వరకు కొమ్మలు తుంచుతూ కోతలు కోయ వచ్చు. 4, 5 కోతల తర్వాత విత్తనం కోసం వదిలిపెట్టాలి. సూచనలు పాటించి సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన పెంచండి


మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్

నాగర్‌కర్నూల్ క్రైం: దోమ కాటు వలన డెంగీ, మలే రియా, ఫైలేరియా, చికెన్ గునియా లాంటి ఎన్నో వ్యాధులు ప్రబలుతున్నాయని, వాటిని నిర్మూలిం చేందుకు వైద్యసిబ్బంది ప్రజలను చైతన్య పరచాలని రాష్ట్ర మలేరియా అడిషినల్ డైరెక్టర్ అమర్‌సింగ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగ ణంలోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యాధికారులు, సిబ్బందికి నిర్వహించిన సమావే శంలో మాట్లాడారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు ముఖ్యంగా ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాలలో నీటి నిల్వలేకుండా చూడాలని, వారా నికి ఒక్కరోజు డ్రై డే పాటించాలని అన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దోమ తెరలు వాడేలా చూడాలన్నారు. డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ మాట్లాడుతూ.. అవసరమైన ప్రతి ఒక్కరికి మలేరియా, డెంగీ తదితర పరీక్షలు, మం దులు అందుబాటులో ఉన్నాయని ప్రజలకు అవ గహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ వెంకటేష్, ఎంటమాలజిస్ట్ సైదులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకట్‌దాస్, భీమానాయక్, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

నిరంతర ప్రయత్నంతో సివిల్ సర్వీసెస్ సాధన

21 సెంచరీ ఐఏఎస్ అకాడమి చైర్మన్ కృష్ణప్రదీప్


విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న కృష్ణప్రదీప్

జడ్చర్ల టౌన్: ఆసక్తి, పట్టుదల, నిరంతర ప్రయత్నంతో సివిల్ సర్వీసెస్ సాధించవచ్చని 21సెంచరీ ఐఏఎస్ అకాడమి చైర్మన్ కృష్ణప్రదీప్ అన్నారు. డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పోటీపరీక్షల విభాగం, మహిళా సాధికారత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో యూనియన్ పబ్లిక్ సర్వీసెస్ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో వచ్చే నోటిఫికేషన్‌లపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పిం చారు. కేంద్ర స్థాయిలో ఉన్నత ఉద్యోగాలుగా భావించబడే సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్ ఎపుడు వస్తుంది, ఏ పుస్తకాలు అధ్యయనం చేయాలి, ఏ విధంగా ప్రణాళికను రూపొందించుకోవాలో తెలి యజేశారు. సివిల్ సర్వీసెస్ ఉద్యోగం సాధిస్తే భవి ష్యత్ ఉన్నతంగా ఉంటుందని, ఇది సాధించేందుకు ఆర్థిక సమస్యలు ఎలాంటి ఆటంకాలు కావని వివ రించారు. విద్యార్థుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.అప్పియాచిన్నమ్మ మాట్లాడుతూ.. లక్ష్యాల స్థాయి ఉన్నతంగా ఉన్నప్పుడు ఉన్నతమైన ఉద్యోగాలు సాధించేం దుకు అవకాశం ఉంటుందన్నారు. దేశంలో అత్యున్నత పదవులుగా భావించే సివిల్ సర్వీసెస్ సాధించటానికి డిగ్రీస్థాయి నుంచే శ్రద్ధ కనబర్చాల న్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివా సులు, పోటీపరీక్షల విభాగం కన్వీనర్ యాదయ్య, మహిళా సాధికారత విభాగం కో– ఆర్డినేటర్ సుభాషిణి, అధ్యాపకులు డా.కళ్యాణి నరసిం హరావు, విక్రమ్, బాలరాజు, జగన్, మాధవి, అనిత, శ్రావణి పాల్గొన్నారు.

వివాహానికి వెళ్తుండగా ప్రమాదం

● చెట్టును ఢీ కొన్న వాహనం ● 5గురికి గాయాలు


ఆస్పత్రిలో బాధితులకు పరామర్శి స్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేరు రూరల్: బొలెరో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడం తో 5గురు గాయ పడిన ఘటన గురువారం శ్రీ రం గాపురం శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. నాగసా నిపల్లికి చెందిన హరిజన్ రాముడు కుమార్తె వివాహానికి గురు వారం ఉదయం వారి బంధువులతో కలిసి పాన్‌గల్ మం డలం బుసిరెడ్డిపల్లికి బయలు దేరారు. ఈ క్రమంలో శ్రీ రం గాపురం దాటిన తర్వాత డ్రైవర్ మీసాల రాజు వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో అదుపు తప్పింది. రోడ్డు పక్కన ఉన్న చెట్టు ఢీ కొంది. ఘటనలో వాహనంలో ఉన్న సాయమ్మ, చిట్టెమ్మ, బాలకిష్టమ్మ, చిన్నయ్య, ఆంజనే యులు గాయాల పాలయ్యారు. కాగా వారిని 108లో వనప ర్తి ఆస్పత్రికి తరలించారు. కాగా ఆంజనేయులును మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని నిమ్స్‌కు పంపించారు. ఘటనపై బంధువు బత్తిని బందెన్న ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పరామర్శ

ఘటనలో గాయపడిన వారిని రాష్ట్ర ప్రణాళిక సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కాం గ్రెస్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ ఆస్పత్రికి వెళ్లి పరామ ర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
655	203
73,651	22,327

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,381	▼	19
డోజోన్స్	39,765	▲	4
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,953	▲	21
డాక్స్	18,492	▲	15
షాంఘై	3,110	▲	18
నికాయ్	40,168	▼	595

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
66,760	▲	126
బంగారం (99.5 స్వచ్ఛత)		
66,691	▲	125
వెండి (కేజీ)		
74,747	▲	250

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.93	83395
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.32	106.84
€	యూరో	ఎస్‌బీఐ	89.25	90.68
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.34	56.14
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.54	55.75
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.34	64.75
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.28	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.69	23.55
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.47

చేతులు కలిపిన అంబానీ- అదానీ

అదానీ పవర్ ప్రాజెక్టులో రిలయన్స్‌కు 26 శాతం వాటా



న్యూఢిల్లీ: బిలియనీర్ పారిశ్రామిక దిగ్గజాలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ తొలిసారి చేతులు కలిపారు. దీనిలో భాగంగా అదానీ పవర్‌కు చెందిన పవర్ ప్రాజెక్టులో రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) 26 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. అంతేకాకుండా మధ్యప్రదేశ్‌లోని ఈ ప్లాంటుకు చెందిన 500 మెగావాట్ల యూనిట్‌లో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఆర్‌ఐఎల్ సొంత అవసరాలకు వినియోగించుకునేందుకు రెండు సంస్థలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. వెరసి అదానీ పవర్ పూర్తి అనుబంధ సంస్థ మహన్ ఎనర్జెన్ లిమిటెడ్‌లో 5 కోట్ల ఈక్విటీ షేర్లను ఆర్‌ఐఎల్ సొంతం చేసుకోనుంది. రూ. 10 ముఖ విలువకే(రూ. 50 కోట్లు) వీటిని చేజిక్కించుకోవడంతోపాటు.. 500 మెగావాట్ల విద్యుత్‌ను సొంత అవసరాలకు ఆర్‌ఐఎల్ వినియోగించుకోనుంది. సొంత వినియోగ పాలసీలో భాగంగా ఆర్‌ఐఎల్ 20 ఏళ్ల దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని(పీపీఏ) ఎంఈఎల్‌తో కుదుర్చుకున్నట్లు అదానీ పవర్ వెల్లడించింది. మొత్తం 2,800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ సామర్థ్యంతో ఏర్పాటవుతున్న ఎంఈఎల్ ప్లాంటులో 600 మెగావాట్ల యూనిట్‌ను సొంత అవసరాల పద్ధతిలో తెరతీయనున్నట్లు వివరించింది.

అదానీ గ్రూప్ ప్రపంచ అతిపెద్ద కాపర్ ప్లాంట్

గుజరాత్‌లోని ముంద్రాలో అదానీ గ్రూప్ భారీ కాపర్ ప్లాంటు తొలి దశను ప్రారంభించింది. ఇది ప్రపంచంలోనే సింగిల్ లొకేషన్‌లో ఏర్పాటైన అతి పెద్ద కాపర్ తయారీ కర్మాగారంగా నిలవనుంది. దీనితో దిగుమతులపై ఆధారపడే పరిస్థితి కొంత తగ్గనుంది.

అంబుజాలో అదానీ వాటా అప్

రూ. 6,661 కోట్ల పెట్టుబడులు

డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ తాజాగా అంబుజా సిమెంట్స్‌లో వాటాను పెంచుకుంది. 21.2 కోట్ల వారంట్లను ఈక్విటీ షేర్లుగా మార్పిడి చేసుకోవడం ద్వారా 3.6 శాతం అదనపు వాటాను పొందింది. ఇందుకు రూ. 6,661 కోట్లు వెచ్చించగా.. ప్రస్తుతం అంబుజాలో అదానీ వాటా 66.7 శాతానికి చేరింది. దేశీయంగా సిమెంట్ తయారీలో రెండో పెద్ద కంపెనీగా నిలుస్తున్న అంబుజాలో ప్రమోటర్ సంస్థ హార్మోనియా ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ షేరుకి రూ. 314.15 సగటు ధరలో వారంట్లను మార్పిడి చేసుకుంది. ఇంతక్రితం 2022 అక్టోబర్‌లోనూ ప్రమోటర్ సంస్థ వారంట్లను అందుకోవడం ద్వారా రూ. 5,000 కోట్లు ఇన్వెస్ట్ చేసిన విషయం విదితమే. దీనిలో భాగంగా హార్మోనియాకు 47.74 కోట్ల మార్పిడికి వీలయ్యే వారంట్లను అంబుజా సిమెంట్స్ జారీ చేసింది.

చిన్న పొదుపులపై వడ్డీరేట్లు యథాతథం



న్యూఢిల్లీ: చిన్న పొదుపులపై వడ్డీరేట్లు ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో జనవరి–మార్చి తరహాలోనే యథాతథంగా కొనసాగనున్నాయి. వీటిలో ఎటువంటి మార్పూ ఉండబోదని కేంద్రం ప్రకటించింది. ప్రకటన ప్రకారం సురక్ష సమృద్ధి యోజనపై 8.2% వడ్డీరేటు అమలవుతుంది. మూడేళ్ల టర్మ్ డిపాజిట్‌పై వడ్డీ రేటు 7.1%. పీపీఎఫ్‌పై వడ్డీ 7.1 శాతంకాగా, పోస్టాఫీస్ సేవింగ్స్ డిపాజిట్ స్కీమ్‌పై 4% వడ్డీ అమలవుతుంది. కిసాన్ వికాస పత్రపై 7.5% వడ్డీ లభిస్తుంది. ఇన్వెస్ట్‌మెంట్ మెచ్యూరిటీ కాలం 115 నెలలు. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌పై వడ్డీ 7.7%. నెలవారీ ఆదాయ పథకంపై 7.4% వడ్డీ లభిస్తుంది.

ఫిబ్రవరిలో మౌలికం నెమ్మది



న్యూఢిల్లీ: ఎనిమిది కీలక పరిశ్రమలతో కూడిన భారత్ మౌలిక రంగం ఫిబ్రవరిలో 6.7 శాతం పురోగమించింది. 2023 ఇదే నెల్లో ఈ వృద్ధి రేటు 7.4 శాతం. అయితే జనవరితో పోల్చితే (4.1 శాతం) గ్రూప్ పురోగమించడం గమనార్హం. సమీక్షా నెల్లో ఎరువుల రంగంలో వృద్ధిలేకపోగా, క్షీణ రేటు నమోదయ్యింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రూప్ పురోగతి గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూస్తే 8.2% నుంచి 7.7 శాతానికి తగ్గింది. ఎరువులుసహా బొగ్గు, క్రూడ్ ఆయిల్, సహజ వాయువు, రిఫైనరీ ప్రొడక్టులు, స్టీల్, సిమెంట్, ఎలక్ట్రిసిటీ రంగాలు ఉన్నాయి. పారిశ్రామిక ఉత్పత్తిలో వీటి వెయిటేజ్ 42 శాతం.

కొటక్ బ్యాంక్ చేతికి సొనాటా ఫైనాన్స్

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం కొటక్ మహీంద్రా బ్యాంక్ తాజాగా ఎన్‌బీఎఫ్‌సీ.. సొనాటా ఫైనాన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌ను కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 537 కోట్లు వెచ్చించింది. 549 బ్రాంచీల ద్వారా సొనాటా 10 రాష్ట్రాలలో కార్యకలాపాలు విస్తరించింది. ఆర్‌బీఐ రిజిస్టర్డ్ మైక్రోఫైనాన్స్ సంస్థ సొనాటా నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) సుమారు రూ. 2,620 కోట్లు కాగా.. 100 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు కొటక్ బ్యాంక్ పేర్కొంది. దీంతో సొనాటా పూర్తి అనుబంధ సంస్థగా ఆవిర్భవించినట్లు వెల్లడించింది.

ఈ వార్తల నేపథ్యంలో కొటక్ బ్యాంక్ షేరు

ఆర్థిక సంవత్సరానికి

లాభాలతో గుడ్ బై...

- సెన్సెక్స్ 655 పాయింట్లు ప్లస్
- 22,250 స్థాయి పైకి నిఫ్టీ
- గుడ్‌ఫ్రైడే సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు

ముంబై: ఆర్థిక సంవత్సరం చివరి రోజైన గురువారం స్టాక్ సూచీలు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 655 పాయింట్లు పెరిగి 73,651 వద్ద ముగిసింది. నిఫ్టీ 203 పాయింట్లు బలపడి 22,327 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి మీడియా మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 1,194 పాయింట్లు పెరిగి 74,190 వద్ద, నిఫ్టీ 392 పాయింట్లు బలపడి 22,516 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. స్టాక్ మార్కెట్ సంబంధించి ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో పాటు ఫారెక్స్ మార్కెట్లో బలహీనతల కారణంగా ఆఖర్లో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. దీంతో సూచీలు కొంతమేర ఆరంభ లాభాలు కోల్పోయాయి. సెన్సెక్స్ దాదాపు ఒకశాతం లాభపడటంతో బీఎస్‌ఈలో రూ.3.33 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.

నేడు ఎక్ఛేంజీలకు గుడ్‌ఫ్రైడే సెలవు. శని, ఆదివారాలు సాధారణ సెలవులు రోజులు కావడంతో ట్రేడింగ్ సోమవారం ప్రారంభం అవుతుంది.


- సెన్సెక్స్ 30 షేర్లలో యాక్సిస్ బ్యాంక్ (0.50%), రిలయన్స్ (0.37%), హెచ్‌సీఎల్ (0.26%), టెక్ మహీంద్రా (0.25%) మాత్రమే నష్టపోయాయి. మిగిలిన 26 షేర్లు లాభపడ్డాయి.
- బీఎస్‌ఈ, నిఫ్టీలు ఎంపిక చేసుకున్న షేర్లలో బీటా వెర్షన్ టీ+0 ట్రేడ్ సెటిల్‌మెంట్‌ను ప్రారంభించాయి. తొలి రోజున రెండు ఎక్స్ఛేంజీల్లో 60 మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు.

ర్యాలీ ఎందుకంటే

ప్రత్యామ్నాయ పెట్టుబడి ఫండ్ల(ఏఐఎఫ్)లో రుణదాతల పెట్టుబడులపై గతంలో కఠిన ఆంక్షల విధించిన ఆర్‌బీఐ తాజాగా నిబంధనలను సులభతరం చేయడంతో అధిక వెయిటేజీ ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులతో పాటు ఫైనాన్స్ రంగాల షేర్లు రాణించాయి. మోర్గాన్ స్టాన్లీ వచ్చే ఆర్థిక సంవత్సరానికి గానూ భారత వృద్ధి అవుట్‌లుక్‌ను 6.5 శాతం నుంచి 6.8 శాతానికి అప్‌గ్రేడ్ చేసింది. ఇటీవల ఎఫ్‌ఐఐలు భారత ఈక్విటీల పట్ల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. అమెరికా సూచీలు రికార్డు స్థాయిల్లో ట్రేడవుతున్నాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు 0.5% పెరిగాయి.

2023- 24లో రూ.128 లక్షల కోట్ల సృష్టి

దేశీయ స్టాక్ మార్కెట్ 2023–24లో గణనీయమైన లాభాలు పంచింది. సెన్సెక్స్ 14,660 పాయింట్లు (25%) ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం విలువ ఏడాది వ్యవధిలో 128 లక్షల కోట్లు పెరిగి రూ.387 లక్షల కోట్లు చేరింది. సెన్సెక్స్ మార్చి 7న 74,245 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. మార్చి 2న ఇన్వెస్టర్ల సంపద సైతం రూ.394 లక్షల వద్ద ఆల్‌టైం హైని తాకింది. ఇదే కాలంలో నిఫ్టీ 4,967 పాయింట్లు(29%) పెరిగింది. మార్చి 11న 22,526 వద్ద చరిత్రాత్మక గరిష్టాన్ని అందుకుంది. 2022–23లో 423 పాయింట్లు పెరిగినప్పటికీ ఇన్వెస్టర్లకు రూ. 5.86 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది.



ఐసీఐసీఐ సెక్యూరిటీస్ డీలిస్టింగ్

స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి డీలిస్ట్ చేసేందుకు 72 శాతం వాటాదారులు అనుమతించినట్లు ఐసీఐసీఐ సెక్యూరిటీస్ తాజాగా వెల్లడించింది. అయితే రిటైల్ ఇన్వెస్టర్లు ఈ పథకాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది. డీలిస్టింగ్ తదుపరి మాతృ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్‌లో విలీనంకానున్నట్లు తెలియజేసింది. డీలిస్టింగ్ పథకంలో భాగంగా ఐసీఐసీఐ సెక్యూరిటీస్ వాటాదారులు తమ వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 67 ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లను పొందనున్నట్లు వెల్లడించింది.

కార్వీకి సెబీ మరో షాక్

కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్ లిమిటెడ్‌కు సెబీ మరో షాక్ ఇచ్చింది. అర్హత ప్రమాణాలను ఉల్లంఘించినందుకు మర్చంట్ బ్యాంకర్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. 2023 మార్చి 15–17 తేదీల్లో కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్‌ను సెబీ బృందం తనిఖీల నేపథ్యంలో తాజా నిర్ణయం తీసుకుంది. గతంలోనూ సెబీ కార్వీపై పలు చర్యలు తీసుకున్న సంగతి విదితమే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-3-2024	
విశాఖ	415–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400–00
విజయవాడ	400–00
రిటైల్ ధర (డజను)	72.00
29-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	375–00
వరంగల్	377–00
రిటైల్ ధర	4.35

టయోటా వాహనాలు కాస్త ప్రియం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టయోటా మోటార్ ఎంపిక చేసిన మోడళ్లపై 1 శాతం వరకు ధరలు పెంచనుంది. ఏప్రిల్ 1 నుంచి సవరించిన ధరలు అమలులోకి రానున్నాయని కంపెనీ గురువారం ప్రకటించింది. తయారీ, నిర్వహణ వ్యయాలు అధికం అవుతున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. టయోటా తయారు చేస్తున్న మోడళ్ల ధర ఎక్స్‌షోరూంలో రూ.6.86 లక్షలు మొదలుకుని రూ.51.44 లక్షల వరకు ఉంది.

భారత్‌లో ఐఏఐ అనుబంధ సంస్థ ఏర్పాటు



న్యూఢిల్లీ: ఏరోస్పేస్, రక్షణ రంగ దిగ్గజం ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) భారత్‌లో తమ అనుబంధ సంస్థ ఏరోస్పేస్ సర్వీసెస్ ఇండియా (ఏఎస్‌ఐ)ని ప్రారంభించింది. మేక్ ఇన్ ఇండియా లక్ష్య సాధనలో పాలుపంచుకోవడంపై తమ నిబద్ధతకు ఇది నిదర్శనమని ఏఎస్‌ఐ సీఈవో డ్యానీ లాబర్ తెలిపారు. భారతీయ సాయుధ బలగాల కోసం అధునాతన సిస్టమ్స్‌ను అభివృద్ధి చేసే దిశగా ఏఐఏ, డీఆర్‌డీవో మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావడానికి ఇది దోహదపడగలదని వివరించారు.

---

40 తులాల బంగారం, రూ.10 లక్షలు చోరీ

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. ఇంట్లో భద్రపర్చిన బంగారు ఆభరణాలు, నగదు ఊడ్చుకెళ్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తాజాగా జిల్లా కేంద్రంలోని లింగంబాగ్ కాలనీలో గురువారం తెల్లవారుజామున రాజేష్ ఇంట్లోకి చొరబడి 40 తులాల బంగారు ఆభరణాలు, రూ. 10లక్షల నగదును గుర్తు తెలియని దుండగులు అపహరించారు. బాధితుడు తెలిపిన వివరాలిలా.. రెండు రోజుల క్రితం బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో ఇంటికి తాళం వేసి బెంగళూర్‌కు వెళ్లారు. అయితే తాళం వేసిన ఇంట్లోకి గుర్తు తెలియని దుండగులు చొరబడి బీరువాలోని బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం తెరచి ఉండడం, ఇంట్లో బీరువా, వస్తు సామగ్రి చిందరవందరగా పడి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ బీమాకుమార్, ఎస్‌ఐ శ్రీనివాస్, క్లూస్ టీం సభ్యులు అక్కడికి చేరుకొని పలు విషయాలపై ఆరా తీశారు. ఇదిలాఉండగా, గత 20 రోజుల్లో జిల్లా కేంద్రంలో మూడు ఇళ్లలో చోరీలు జరగడంపై పెట్రోలింగ్, గస్తీ, తనిఖీలు చేయడంలో పోలీసు సిబ్బంది విఫలమయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైన కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. చోరీ విషయమై పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. చోరీ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

రామన్‌పాడులో తగ్గిన నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం రోజురోజుకూ తగ్గుతోంది. గురువారం 1,011అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

ఆర్గానిక్ వంటకాలతో పెళ్లి భోజనం

గోఆధారిత వంటకాలు వడ్డించిన వధువు తండ్రి

- తన భార్య అనారోగ్య కారణాలతో రసాయన పదార్థాలకు దూరం
- గతేడాది కూడా మరో కూతురి పెళ్లిలోనూ ఇదే విధానం
- ఆదర్శంగా నిలిచిన విద్యుత్ కాంట్రాక్టర్ రాజనర్సింహ



సేంద్రియ పంటలతో చేసిన భోజనాలు

భూత్పూర్: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో రసాయనిక ఎరువులు వాడిన ఆహార పదార్థాలు, శీతల పానియాలతో పాటు జంక్‌ఫుడ్ ఆహారం మనిషి జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వీటితో తన కుటుంబానికి ఎదురైన ఇబ్బందులను గుర్తించిన ఓ వ్యక్తి తన కూతురి పెళ్లిలో స్వచ్ఛమైన గోఆధారిత పద్ధతిలో పండించిన పదార్థాలతో వంటలు చేసి విందు భోజనం వడ్డించారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రం ఏనుగొండలోని సంతోష్‌నగర్ కాలనీకి చెందిన ఉమామహేశ్వరి రాజనర్సింహశెట్టి దంపతులు తమ కుమార్తె పెళ్లిలో ఆర్గానిక్ వంటలు వడ్డించి పలువురి ప్రశంసలు పొందారు.

ఆరోగ్య సమస్యల కారణంగానే..

రాజనర్సింహశెట్టి విద్యుత్ కాంట్రాక్టర్. ఆయన భార్య ఉమామహేశ్వరి బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. వీరికి నలుగురు సంతానం కాగా అందరూ ఆడపిల్లలే. రాజనర్సింహశెట్టి పెద్ద అమ్మాయికి జన్మించిన కూతురు (మనుమరాలు) అనారోగ్యంతో బాధపడుతుండటంతో పెద్ద అమ్మాయి బంధువుల సలహాతో సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన పంటల ఉత్పత్తులను ఆహారంగా తీసుకున్నారు. క్రమంగా ఆమె ఆరోగ్యం మెరుగుపడింది. దీంతో ఉమామహేశ్వరి, రాజనర్సింహశెట్టి కుటుంబసభ్యులందరూ సేంద్రియంగా పద్ధతిలో సాగు చేస్తున్న పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పంటల ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆర్గానిక్ ఉత్పత్తుల గురించి మరింత మందికి చేరవేయాలనే ఉద్దేశంతో మూడో కూతురు వివాహం గతేడాది ఫిబ్రవరిలో చేయగా.. వివాహానికి హాజరైన వారికి ఆర్గానిక్ వంటకాలతో చేసిన భోజనాలు వడ్డించారు. తాజాగా గురువారం నాలుగో కూతురు మాధురి వివాహ వేడుకల్లోనూ అదే ఒరవడిని కొనసాగించడం విశేషం.

▪ బీజేపీ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి డీకే అరుణ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమంలో టేబుల్‌పై కూర్చొని ఆర్గానిక్ పంటలతో వడ్డించిన ఆహారాన్ని భుజించారు. చాలా ఏళ్ల తర్వాత పెళ్లిలో టేబుల్‌పై కూర్చొని భోజనం చేయడం సంతోషంగా బాగుందని, భోజనాలు రుచిగా ఉన్నాయని డీకే అరుణ అభిప్రాయపడ్డారు.



వస్త్రంపై వధూవరుల ఫొటోల పెయింటింగ్

ప్రత్యేక వంటకాలు..

గురువారం జరిగిన పెళ్లిలో 2,500 మందికి విందు భోజనం తయారు చేశారు. బుధవారం వరుడి కుటుంబ సభ్యులు, బంధువులు దాదాపు 500 మందికి భోజనాలు, అల్పాహారంగా ఇడ్లీ, వడ వడ్డించారు. మైసూర్ మల్లిగ (బియ్యం), కృష్ణ బియ్యం (బ్లాక్‌రైస్)తో స్వీట్లు చేయించారు. టేబుల్‌పై కూర్చోబెట్టి మా పిల్లే సంబ నవారా బియ్యంతో (పెరుగు అన్నం), బాస్మతి రైస్‌తో వెజిటేబుల్ బిర్యాని, స్వచ్ఛమైన నెయ్యి, దేశీ ఆవు పాలు, పెరుగుతో అరటి ఆకులో భోజనాలు వడ్డించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కారువంగకు చెందిన మహిళా రైతు లావణ్య గోఆధారిత ఆర్గానిక్ బియ్యం, పప్పు ధాన్యాలు, కిరాణం తదితర ఆర్గానిక్‌లతో వంటకాలు సిద్ధం చేశారు. పెళ్లి ఫ్లెక్సీ సైతం వస్త్రంపై వధూవరుల ఫొటోలు పెయింటింగ్‌తో గీయించడం గమనార్హం. అలాగే వివాహానికి వచ్చే వారు కొనుగోలు చేసేందుకు ఆర్గానిక్ స్టాల్ ఏర్పాటు చేశారు. ఆర్గానిక్ గోఆధారిత బియ్యం, పప్పు ధాన్యాలు కిరాణం, నెయ్యి, పల్లీలు, జీలకర, నువ్వుల నూనె అందుబాటులో ఉంచారు.



సేంద్రియ వంటకాలతో చేసిన భోజనాలు చేస్తున్న బంధుమిత్రులు

అవగాహన కల్పించాలనే..



ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే నా కూతుళ్ల పెళ్లిలో ఆర్గానిక్ వంటకాలు ఏర్పాటు చేశాను. ఈ విధంగా చేయడం నాకు చాలా సంతోషంగా అనిపించింది. అయితే మామూలు పెళ్లిలో భోజనాల కంటే తక్కువ ఖర్చు అయ్యింది.

– రాజనర్సింహశెట్టి, వధువు తండ్రి


రోగాలు దరిచేరవు..



గోఆధారిత ఆర్గానిక్ ఫాం హౌస్ ఏర్పాటు చేసి వ్యవసాయం చేస్తున్నాను. రాజనర్సింహశెట్టి ఇద్దరు కూతుళ్ల వివాహానికి ఆర్గానిక్ బియ్యం సరఫరా చేశాను. 15 ఎకరాల్లో ఆర్గానిక్ పంట పండించి తమిళనాడుతో పాటు తెలంగాణలో వివిధ రకాల బియ్యం, స్వచ్ఛమైన నెయ్యి, పెరుగు, పాలు సైతం సరఫరా చేస్తున్నా. జీవన విధానంలో, రోగాలు రాకుండా నియంత్రించవచ్చు.

– జయరామన్, తంజావూరు, తమిళనాడు

పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

నవాబుపేట: ఆదిబసవేశ్వర ఆలయ ఉత్సవాల్లో భాగంగా గురువారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన డాక్టర్ శ్రీనివాస్, సరస్వతి దంపతులు పట్టు వస్త్రాలు, మాంగళ్యం, తలంబ్రాలతో వేడుకను చేపట్టారు. అనంతరం అమ్మవారికి వడిబియ్యం పోశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం చేపట్టిన మహామంగళ హారతితో వేడుకలు ముగిశాయి. కాగా తెల్లవారుజామున వీరశైవ సమాజం ఆధ్వర్యంలో అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించారు. పూజారి శ్రీశైలం, రాజలింగం, జంగయ్య, సత్యం, లింగం, వెంకటయ్య, రాంచెంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చివరిరోజు గురువారం రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆరు జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి తాడూరు మండలం యాదిరెడ్డిపల్లికి చెందిన అఖిలేష్‌రెడ్డి టీసీర్ బుల్స్‌కు రూ.50 వేలు నగదు, ద్వితీయ బహుమతిని గద్వాలకు చెందిన గోసాని హరిప్రసాద్ ఎద్దుల జతకు రూ. 40 వేలు, మూడో బహుమతిని వనపర్తి జిల్లా పెద్దదగడకు చెందిన గోపాలకృష్ణ ఎద్దుల జతకు రూ.30 వేలు, 4వ బహుమతిని మానవపాడుకు చెందిన రవీందర్‌రెడ్డి ఎద్దుల జతకు రూ.20 వేలు, ఐదవ బహుమతి మండలంలోని తాడూరుకు చెందిన మహేష్ ఎద్దుల జతకు ఆలయం తరుపున రూ.10 వేలు అందజేశారు. ఆలయం వద్ద జాతరను, ఎద్దుల బండలాగు పోటీలను తిలకించడానికి పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవాల్లో ఈఓ. శ్రీనివాస్‌రావు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజల్‌రావు, నాయకులు పాల్గొన్నారు.



బండను లాగుతున్న ఎద్దులు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మన్యంకొండలో లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి (ఓబులేశు) ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం అలివేలు మంగతాయారు బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా దేవస్థానం సమీపంలోని రాయిచూర్ అంతర్రాష్ట్ర రహదారి పక్కనున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి గుహలో బండరాయిపై వెలసిన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు. స్నపన తిరుమంజసం కార్యక్రమంతో స్వామివారి ఉత్సవాన్ని ప్రారంభించారు. అలాగే మహా నివేదన, సహస్ర నామార్చన, నక్షత్ర హారతి, ఆశీర్వాదం తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవం సందర్భంగా గుహలో వెలసిన స్వామివారిని వివిధ రకాల పూలతో అలంకరించారు.

